సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం, 14, అక్టోబర్, 2024



తుంగభద్రకు భారీ వరద

టీబీ డ్యాంకు భారీగా వరదనీరు చేరుతోంది. ఆదివారం 88 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. 101 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



టమాట కిలో రూ. 56

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ. 56 పలికింది. కనిష్టం 36, సరాసరి 44 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



గరిష్టం/కనిష్టం
35.8°/22.3°

జిల్లా పరిధిలో ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6–8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నేటి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' రద్దు



ప్రశాంతి నిలయం: భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 14,15,16 తేదీల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని సమాచారం ఉన్నందున ఆయా సబ్ డివిజన్ల ఆర్డీఓలు, మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లకు ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తే ఆ ప్రాంతాల అధికారులు సహాయక కార్యక్రమాలు చేపడతారని తెలిపారు.

అంగన్‌వాడీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

పుట్టపర్తి అర్బన్: రాగల రెండు మూడు రోజులు భారీ వర్షాలు ఉన్నందున అంగన్‌వాడీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి సూచించారు. భవనాలు కారుతున్నా, కూలిపోయే పరిస్థితి ఉన్నా కేంద్రాలు తెరవరాదన్నారు. పక్కనే అనుకూలంగా ఉన్న భవనంలో కేంద్రాలు నడపాలన్నారు. చిన్న పిల్లలకు స్వెట్టర్లు, తలకు టోపీలు వేయాలన్నారు. పిల్లలను చలిలో తిప్పరాదన్నారు. గర్భిణులు, బాలింతలు చలిలో బయట తిరగకుండా తెలియజేయాలన్నారు. పరిశుభ్రత పాటిస్తూ, వేడి పదార్థాలను భుజించాలని సూచించాలన్నారు.

అత్యాచార కేసు విచారణ వేగవంతం

సోమందేపల్లి: చిలమత్తూరు మండలంలో అత్తాకోడలుపై జరిగిన అత్యాచార ఘటనకు సంబంధించి విచారణ వేగవంతం చేసినట్లు ఎస్పీ రత్న తెలిపారు. శనివారం రాత్రి సోమందేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల గురించి ఎస్‌ఐ రమేష్‌బాబుతో ఆరా తీశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎక్కడా రాజీ పడకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అత్యాచార ఘటనను సీరియస్‌గా తీసుకుని, నిందితులను గుర్తించి అరెస్టు చేస్తామని చెప్పారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి



పుట్టపర్తి టౌన్: డీఎస్సీకి సన్నద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సాంఘిక సాంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడు నెలల ఉచిత శిక్షణతో పాటు భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందే అభ్యర్థులు ww-w.ja na bh um-i.q p.i n వెబ్ సైట్‌లో ఈ నెల 14లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల వార్షిక ఆదాయం 2.50 లక్షలకు మించకూడదని పేర్కొన్నారు. 22వ తేది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, 27వ తేదీ పరీక్ష నిర్వహిస్తామని, 30వ తేదీ మెరిట్‌లిస్ట్ విడుదల చేస్తామని, నవంబర్ 3న అభ్యర్థుల ఎంపిక, 6వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభిస్తామని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94404 12942 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

సారూ.. ఇదేం తీరు..?



పల్లెను సన్మానిస్తున్న డీఎస్పీ విజయకుమార్

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఇటీవల జరిగిన బదిలీల్లో పుట్టపర్తి డీఎస్పీగా విజయకుమార్ నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎవరైనా ప్రజాప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలవడం పరిపాటి. అయితే నూతన డీఎస్పీ శుక్రవారం రాత్రి నేరుగా మాజీ ఎమ్మెల్యే అయిన పల్లె రఘునాథరెడ్డిని టీడీపీ కార్యాలయంలో కలిసి, పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారాయి. గతంలో పనిచేసినందుకు మర్యాదపూర్వకంగా కలిశారా.. లేక బదిలీకి సహకరించినందుకు స్వామిభక్తి చాటుకునేందుకు సన్మానం చేశారా..? అని పలువురు చర్చించుకోవడం కనిపించింది.



భక్తులతో కిటకిటలాడుతున్న ఖాద్రీశుని ఆలయం



అశ్వవాహనంపై దర్శనమిస్తున్న శ్రీవారు




పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో యజ్ఞ జలాన్ని భక్తులపై సంప్రోక్షణ గావిస్తున్న రుత్వికులు

దసరా సంబరం

కదిరి టౌన్/ ప్రశాంతి నిలయం: విజయదశమి వేడుకలు జిల్లా అంతటా ఘనంగా చేసుకున్నారు. పండుగను పురస్కరించుకుని దేవీ నవరాత్రులు భక్తిశ్రద్ధలతో సాగాయి. శనివారం దసరా పండుగ సందర్భంగా భక్తులతో ఆలయాలు పోటెత్తాయి. అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులను శమీపూజ మండపం వద్దకు తీసుకొచ్చి ఆయుధ పూజ, అస్థాన సేవ పూజా కైంకర్యములను అర్చకులు పూర్తి చేశారు. అనంతరం స్వామివారిని రకారకాల పూలతో అలంకరించి అశ్వవాహనంపై కొలువుదీర్చి తిరువీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఇక పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం పూర్ణచంద్ర ఆడిటోరియంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ ఈ నెల 6న ప్రారంభమైన వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం పూర్ణాహుతితో ముగిసింది. వేద పండితుడు సుబ్బావధాని నేతృత్వంలో 27 మంది రుత్వికుల బృందం ఆరు రోజుల పాటు యజ్ఞ క్రతువులను నిర్వహించారు. యజ్ఞ గుండంలోకి ద్రవ్యాలను సమర్పిస్తూ వేదపఠనం గావించారు. పూర్ణాహుతి తర్వాత యజ్ఞ జలాలను భక్తులపై సంప్రోక్షణ గావించారు. సత్యసాయి సన్నిధిలో విద్వాన్ కుమరేష్, విదుషీ డాక్టర్ జయంతి కుమరేష్‌ల బృందం సంగీత కచేరి నిర్వహించారు.

కిక్కు ఎవరికో?



- నేడు మద్యం దుకాణాల టెండర్ల లక్కీ డ్రా
- జిల్లాలోని 87 దుకాణాలకు 1,460 దరఖాస్తులు
- పుట్టపర్తి, పెనుకొండలోని దుకాణాలకు పోటాపోటీ
- కదిరి, హిందూపురం, రాప్తాడులో అంతంత మాత్రమే
- ధర్మవరం, మడకశిరలో 'తమ్ముళ్ల' కనుసన్నల్లోనే దందా

సాక్షి, పుట్టపర్తి: మద్యం షాపులకు దరఖాస్తు చేసుకున్న వారిలో ఉత్కంఠ నెలకొంది. బెదిరింపు, హెచ్చరికలు, అవాంతరాలు దాటుకుని చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. కిక్కు లక్కు తమను వరిస్తుందా లేదా అని సోమవారం ఉదయం తీసే లాటరీపై గంపెడాశలతో ఎదురుచూస్తున్నారు. జిల్లాలో హిందూపురం, కదిరి నియోజకవర్గాల్లో అంతంత మాత్రంగానే దరఖాస్తులు అందాయి. మరోవైపు పెనుకొండ, పుట్టపర్తిలో భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. దీంతో కూటమి నేతలు సిండికేటుగా మారి ఎవరినీ రానీయకుండా దందా చేసేందుకు సహకరించే వారితోనే ఎక్కువ దరఖాస్తులు వేయించినట్లు తెలుస్తోంది. ఇంకో వైపు ధర్మవరం, మడకశిరలో దరఖాస్తుల మోస్తరుగా ఉన్నప్పటికీ.. ఆయా ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే దరఖాస్తులు వేసినట్లు తెలిసింది. పెనుకొండలో మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి వర్గీయుల మధ్య ఆధిపత్య పోరుతో అధిక దరఖాస్తులు వచ్చాయి. ధర్మవరంలో మంత్రి సత్యకుమార్, టీడీపీ నేత పరిటాల శ్రీరామ్ చెప్పిన వారే దరఖాస్తు చేశారు. కదిరి, హిందూపురంలో అందరినీ బెదిరించి దరఖాస్తు చేయనీయకుండా తమ వారికి మాత్రమే టీడీపీ నేతలు అవకాశం కల్పించారు.

అడుగడుగునా అడ్డగింత..

మద్యం దుకాణాలకు వచ్చిన దరఖాస్తుల్లో సుమారు 80 శాతం టీడీపీ వర్గీయులకు సంబంధించినవే. మిగతా 20 శాతం మంది రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా బరిలో దిగారు. అయితే వారందరికీ ఇప్పటికే వార్నింగ్‌లు వెళ్లినట్లు తెలిసింది. ఒకవేళ లాటరీలో దుకాణం దక్కించుకున్నా వదిలి వెళ్లాల్సిందేనంటూ బెదిరించినట్లు సమాచారం. దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైన రోజు నుంచి టీడీపీ నేతలు బెదిరింపులు మొదలుపెట్టారు. ఎవరు దరఖాస్తు చేసిన ఖబడ్దార్ అంటూ ఫోన్లలో వార్నింగ్ ఇచ్చారు. దీంతో చాలామంది ఔత్సాహికులు వెనక్కి తగ్గారు. కాగా ఆన్‌లైన్ విధానం అందుబాటులో ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి దరఖాస్తులు చేశారు.

టీడీపీ నేతల అండతోనే..

జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలు టెండర్ వేసే ప్రక్రియ మొత్తం ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులు.. వారి పీఏలు, అనుచరుల కనుసన్నల్లోనే జరిగినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ప్రతి దుకాణం తమకు, తమ అనుచరులు చెప్పిన వారికే దక్కే విధంగా టీడీపీ నేతలు ముందస్తు ప్లాన్ చేశారు. దీంతో ఆరంభం నుంచి దరఖాస్తుల ప్రక్రియ మందకొడిగా సాగింది. చాలా చోట్ల సింగిల్ డిజిట్‌లో దరఖాస్తులు ఉండటం గమనార్హం.

నేడు లాటరీ ద్వారా లైసెన్సుల ఖరారు

నూతన మద్యం పాలసీ 2024 –26 కాలవ్యవధితో నిర్వహించుకునే మద్యం షాపులకు దరకాస్తుల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 87 షాపులకు 1,460 దరఖాస్తులు అందాయి. సోమవారం పుట్టపర్తిలో కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిలో షాపులు ఖరారు చేయనున్నారు. దరఖాస్తుదారులు ఉదయం ఏడు గంటలలోపు గుర్తింపు కార్డుతో హాజరు కావాల్సి ఉంది. నాన్ రీఫండబుల్ కింద ప్రతి దరకాస్తు నుంచి ప్రభుత్వానికి రూ.2 లక్షలు రానుంది. ఈ లెక్కన జిల్లాలో 1,460 దరఖాస్తుల రూపేణా రూ.29.20 కోట్ల ఆదాయం సమకూరనుంది.

పోటీ తీవ్రత ఇదీ..

దరఖాస్తులు	దుకాణాలు
40 పైగా	4
30 నుంచి 40 లోపు	9
20 నుంచి 30 లోపు	14
10 నుంచి 20 లోపు	36
10 లోపు	24

ఎక్సైజ్ స్టేషన్ల వారీగా దరఖాస్తులు ఇలా..

219	ధర్మవరం (1నుంచి 20వ షాపు వరకు)
28	సీకే పల్లి (21 - 25)
244	పెనుకొండ (26 - 38)
328	పుట్టపర్తి (39 - 48)
224	హిందూపురం (49 - 59)
120	కదిరి (60 - 71)
136	తనకల్లు (72 - 77)
161	మడకశిక (78 - 87)

పుట్టపర్తిలో భారీ బందోబస్తు



రత్న, ఎస్పీ

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి పట్టణంలోని సాయి ఆరామంలో సోమవారం ఉదయం ఏడు గంటలకు నిర్వహించే మద్యం దుకాణాల ఎంపిక లాటరీ కార్యక్రమానికి భారీబందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు. ఈ మేరకు ఆదివారం పోలీస్ అధికారులు, ఎక్సైజ్ అధికారులతో పోలీస్ కార్యాలయం నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 8 ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని 87 దుకాణాల ఎంపిక ప్రక్రియ కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ జరుగుతుందన్నారు. దరఖాస్తుదారులు ఎంట్రీ పాస్‌తోపాటు గుర్తింపుకార్డు తప్పనిసరిగా వెంట తీసుకురావాలన్నారు. దరఖాస్తులు తప్ప ఇతరులకు పట్టణంలోకి అనుమతి లేదన్నారు. పుట్టపర్తి పట్టణంలో 30 యాక్ట్, 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. దరఖాస్తుదారుల కోసం గ్యాస్ గోడౌన్, కోవెలగుట్టపల్లి క్రాస్ వద్ద 500 మీటర్ల దూరంలో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులు బ్రహ్మణపల్లి, ఎనుములపల్లి, చిత్రావతి బైపాస్ మీదుగా పుట్టపర్తిలోకి ప్రవేశం ఉంటుందని తెలిపారు. కర్ణాటక నాగేపల్లి నుంచి వచ్చే వాహనాలు చిత్రావతి, బైపాస్, ఎనుములపల్లి, బ్రాహ్మణపల్లి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మీదుగా మామిళ్లకుంట క్రాస్‌కు చేరుతాయన్నారు. మద్యం షాపుల విషయంలో పోలీసు నియమనిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైఎస్సార్, సూరి విగ్రహాలపై దాడి



పాక్షికంగా ధ్వంసమైన వైఎస్సార్ విగ్రహం

కనగానపల్లి : మద్దెలచెరువు గ్రామంలోని వైఎస్సార్, మద్దెలచెరువు సూరి విగ్రహాలపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. శుక్రవారం రాత్రి గ్రామంలోని కొందరు టీడీపీ నాయకుల ప్రోద్బలంతో ఆ పార్టీ కార్యకర్తలు ప్రధాన రహదారి పక్కన ఉన్న వైఎస్సార్, సూరి విగ్రహాలను ధ్వంసం చేసేందుకు పూనుకున్నారు. విగ్రహాల ముఖాలపై రాళ్లతో కొట్టడంతో పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ఇంతలోనే చుట్టుపక్కల వారు గమనించడంతో టీడీపీ కార్యకర్తలు అక్కడి నుంచి పారిపోయారు. ధ్వంసమైన విగ్రహాలను శనివారం ఉదయం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు గంగుల సుధీర్‌రెడ్డి, మారుతీప్రసాద్ పరిశీలించి.. కనగానపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ ఇషాక్ బాషా గ్రామంలో విచారించి, విగ్రహాలపై ప్రత్యక్షంగా దాడికి పాల్పడిన టీడీపీ కార్యకర్త బొమ్మయ్యను అదుపులోకి తీసుకుని.. కేసు నమోదు చేశారు. దాడికి ప్రేరేపించిన టీడీపీ నాయకులపైనా కేసు నమోదు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకురాలు, మద్దెలచెరువు సూరి సతీమణి గంగుల భానుమతి, స్థానిక పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.



ధ్వంసమైన సూరి విగ్రహం

3 రోజులూ అప్రమత్తంగా ఉండాలి

- వర్షాల నేపథ్యంలో అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తోకలసి డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాలు కురిస్తే తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. విద్యుత్, వ్యవసాయ అనుబంధ, మున్సిపల్, రెవెన్యూ, గృహనిర్మాణ, పోలీసు, వైద్యం, పంచాయతీ తదితర 15 శాఖల అధికారులో సమీక్షిస్తూ క్షేత్రస్థాయిలో ప్రాథమిక సమాచారాన్ని సేకరించి విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సచివాయాలు, పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితులను తెలుసుకుంటూ అవసరమైన చర్యలు, పునరావాస కేంద్రాల ఏర్పాటు, సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భారీ వర్షాలకు రహదారులు కొట్టుకుపోవడం, ఉద్యాన పంటలు దెబ్బతినడం, ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాలు కురిసే సమయంలో ప్రజలు ప్రయాణాలు, ఇతరత్ర కార్యక్రమాలను రద్దు చేసుకోవాలని, అత్యవసరమైతే మాత్రమే ఇంటి నుంచి బయటికి రావాలని చెప్పారు. లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను వర్షాలు, వరద నీటి తీవ్రను బట్టి పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, పట్టు పరిశ్రమ శాఖల అధికారులు గ్రామాలలో ప్రజలు అప్రమత్తం చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పునరావాస కేంద్రంలో వైద్య సిబ్బందిని కచ్చితంగా ఏర్పాటు చేసి, అవసరమైన మందులను సిద్ధంగా ఉంచాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలు, అంతరాయాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

పుట్టపర్తి టౌన్: తుపాన్ ప్రభావంతో మూడు రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయంలో 91775 21113, 91775 54925 నంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ప్రహ్లాద తెలిపారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రాకూడదని, ఎక్కడైనా ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఏర్పడినా, ప్రాణ, ఆస్తి నష్టం జరిగినా, విద్యుత్ స్తంభాల వైర్లు పడిపోయినా, చెట్లు కూలిపోయినా, కంట్రోల్‌రూమ్‌కు ఫోన్ చేస్తే పునరావాస కేంద్రాలకు తరలిస్తామన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందికి ఎలాంటి సెలవులూ ఉండవని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని తెలిపారు.

ఉద్యాన రైతులూ జాగ్రత్త

పుట్టపర్తి అర్బన్: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఉద్యాన రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుని పంటలు కాపాడుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. తోటల్లో నీరు నిల్వ ఉంటే కాయలు కుళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు. అరటి గెలలు ఉన్న తోటల్లో పెను గాలులతో కూడిన వర్షానికి చెట్లు పడిపోకుండా కట్టెల సహాయంతో ఊతమివ్వాలన్నారు. కోతకు వచ్చిన గెలలను ముందుగానే కోసి విక్రయించుకోవాలన్నారు. బొప్పాయి పంటలో కోతకు సిద్ధంగా ఉన్న వాటిని ముందుగానే కోయాలన్నారు. కోతకు వచ్చిన పండ్లను ప్యాక్ చేసి ప్యాక్ హౌస్‌లలో నిల్వ చేయాలన్నారు. వర్షాల సమయంలో టమాట కోయరాదని, కోతకు సిద్ధంగా ఉన్న వాటిని కోసి గాలి వచ్చే ప్రదేశంలో నిల్వ చేయాలన్నారు. గాలులకు కర్రలు పడిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి, అధిక వర్షాలకు వచ్చే మచ్చ తెగులు రాకుండా ముందు జాగ్రత్తగా 2.5 గ్రాముల ఎం45, 1 గ్రాము కార్బెండజైమ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ముందుజాగ్రత్తలతో పండ్లు, కూరగాయల తోటల రైతులు అప్రమత్తంగా ఉండి సంరక్షించుకోవాలన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంలో అపచారం



2005లో పుట్టపర్తిలో టూరిజం హోటల్ ప్రారంభిస్తున్న సత్యసాయి బాబా (ఫైల్)

- పుట్టపర్తిలో మద్యం, మాంసం నిషేధం
- సాయిఆరామంలో మద్యం టెండర్ల ప్రక్రియ ఏర్పాటుపై సర్వత్రా విమర్శలు

పుట్టపర్తి టౌన్/ పుట్టపర్తి రూరల్: భగవాన్ సత్యసాయిబాబా నడయాడిన ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో మద్యం షాపుల లైసెన్సుల ఖరారు ప్రక్రియ చేపట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2004–05లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, పర్యాటక శాఖ మంత్రి గీతారెడ్డి పుట్టపర్తిలోని టూరిజం హోటల్‌కు భూమి పూజ చేశారు. రూ.1.50 కోట్లు వెచ్చించి టూరిజం గెస్ట్ హౌస్ నిర్మించారు. బాబా భక్తురాలైన గీతారెడ్డి, ఉమ్మడి అనంతపురం జిల్లా కలెక్టర్ అనురాధ ప్రత్యేక చొరవతో భగవాన్ సత్యసాయిబాబా చేతుల మీదుగా టూరిజం గెస్ట్ హౌస్‌ను ప్రారంభించారు. తిరుమల తిరుపతి తరహాలో అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందుతున్న పుట్టపర్తిని సైతం ప్రత్యేకమైన ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం భావించింది. అందులో భాగంగా పుట్టపర్తి నుంచి ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో మద్యం, మాంసం విక్రయాలు కొనసాగించకూడదని గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అప్పటి నుంచి పుట్టపర్తికి వచ్చే దేశ, విదేశీ భక్తులు ఎవ్వరూ మద్యం, మాంసం స్వీకరించరు. అంతటి పవిత్ర ప్రదేశం పుట్టపర్తిలో కూటమి ప్రభుత్వం నేడు అపచారం తలపెట్టింది. పుట్టపర్తిలోని సాయి ఆరామం హోటల్లో మద్యం దుకాణాల లైసెన్సుల ఖరారు కోసం సోమవారం లాటరీ తీసే కార్యక్రమం ఏర్పాటు చేయడంపై సత్యసాయి భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నడూ లేనిది ఆధ్యాత్మిక కేంద్రంలో ఇటువంటి చర్య తీసుకోవడం ఏమిటని విస్తుపోతున్నారు.

క్లుప్తంగా

చేనేత కార్మికుడి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: స్థానిక శాంతినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు రవీంద్ర జీవితంపై విరక్తితో ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు... కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న రవీంద్రకు కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. ఆదివారం రాత్రి నొప్పి తీవ్రత భరించలేక విషపూరిత ద్రావకం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

వ్యక్తి బలవన్మరణం



శ్రీనివాసులు (ఫైల్)

ధర్మవరం అర్బన్: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని సిద్దయ్యగుట్టకు చెందిన శ్రీనివాసులు (40)కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మెడికల్ ఏజెన్సీతో పాటు ఓ మందుల దుకాణాన్ని నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో వ్యాపారం నిమిత్తం అప్పులు చేయాల్సి వచ్చింది. అయితే వ్యాపారం సజావుగా సాగకపోవడంతో అప్పులకు వడ్డీల భారం పెరిగి తీర్చలేని స్థాయికి చేరుకున్నాయి. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మదనపడుతున్న శ్రీనివాసులు.. దసరా రోజు శనివారం భార్య భువనేశ్వరి సంగమేశ్వర ఆలయానికి వెళ్లిన సమయంలో ఇంట్లోనే చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలయం నుంచి తిరిగి వచ్చిన భార్య... ఎంత పిలిచినా భర్త తలుపులు తీయకపోవడంతో చుట్టుపక్కల వారిని పిలిచి తలుపులు బద్దలు కొట్టించి లోపలకెళ్లి చూశారు. అప్పటికే ఉరికి విగత జీవిగా వేలాడుతున్న భర్తను చూసి బోరున విలపించింది. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం



మృతురాలు

హిందూపురం టౌన్: స్థానిక రైల్వేస్టేషన్ పార్క్‌లో ఆదివారం ఉదయం ఓ గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలికి సుమారు 70 నుంచి 75 ఏళ్ల వయస్సు ఉంటుందని అంచనా వేశారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఆమె మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించి, గుర్తు తెలియని మృతదేహం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96845, 94922 92778కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

సన్నగిల్లుతున్న గోల్డెన్ ఆశలు

- విద్యుత్, నీటి సరఫరా లేక ముందుకు సాగని ఆలయ నిర్మాణ పనులు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శరవేగంగా పనులు
- కొండపైకి సుందరమైన రోడ్డు నిర్మాణం
- కొండ కింది భాగంలోనూ స్థలం కేటాయింపు
- కూటమి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం కనిపించని పురోగతి



పెనుకొండ కొండపై నిర్మాణం చేపట్టబోయే లక్ష్మీనరసింహస్వామి గోల్డెన్ టెంపుల్ నమూనా

పెనుకొండ: చరిత్రాత్మకమైన పెనుకొండలోని కొండపై శిథిలావస్థలో ఉన్న ఘనగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం సమీపంలో నూతనంగా అంతర్జాతీయ స్థాయిలో ఇస్కాన్ చేపట్టిన గోల్డెన్ టెంపుల్ నిర్మాణంపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. రూ.100 కోట్ల వ్యయంతో ఆలయ నిర్మాణంతో పాటు 65 అడుగుల ఎత్తైన లక్ష్మీనరసింహస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించి పెనుకొండను పర్యాటక కేంద్రంగా మార్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇస్కాన్ సంస్థ ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కొండపైకి రాకపోకలు సాగించేందుకు సుందరమైన రోడ్డును ఆగమేఘాలపై నిర్మించారు. అలాగే కొండ దిగువన ఎంతో విలువైన స్థలాన్ని కేటాయించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మిగిలిన పనులకు గ్రహణం సోకింది. విద్యుత్, నీటి వసతులు లేకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు.

ఏడేళ్ల క్రితమే కార్యాచరణ..

రాయల రెండవ రాజధానిగా ఖ్యాతి గాంచిన పెనుకొండ కొండపై అప్పట్లో తమ ఇలవేల్పు లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని శ్రీకృష్ణదేవరాయులు నిర్మించారు. ఆలయం పక్కనే సుందరమైన మంటపాలు, కొలను ఏర్పాటు చేశారు. తరచూ కృష్ణదేవరాయలు సూర్యోదయానికి మునుపే కొలనులో స్నానమాచరించి, మంటపాల కిందుగా ఆలయానికి చేరుకునే వారని చరిత్రకారులు చెబుతున్నారు. కాలక్రమేణా రాచరికాలు అంతరించి సరైన పోషణ లేకపోవడంతో ఆలయమూ శిథిలావస్థకు చేరుకుంది. ఏడేళ్ల క్రితం పెనుకొండ కోట సందర్శనకు వచ్చిన బెంగళూరు బృందావన చంద్రోదయ మందిర్ (ఇస్కాన్) చైర్మన్ మధు పండిట్‌దాస్, తదితరులు పర్యాటకానికి ఇక్కడ ఎంతో అనువుగా ఉందని భావిస్తూ రూ.100 కోట్లతో లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని జీర్ణోద్ధరణ గావించడంతో పాటు బంగారు తాపడం చేయాలని, మరో రూ. 200 కోట్లతో గురుకుల పాఠశాల, గవర్నర్ బంగ్లా నిర్మాణం ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేసేలా నివేదికను సిద్ధం చేసి అప్పటి ప్రభుత్వానికి నివేదించారు.

నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కొరత


దశల వారీగా కొండపైకి పనులు పూర్తి చేస్తున్న క్రమంలో నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించాల్సిన తరుణంలో సార్వత్రిక ఎన్నికలు వచ్చి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. అప్పటి నుంచి ఈ పనులు ముందుకు సాగలేదు. ఈ రెండు పనులను పూర్తి చేయడంలో కూటమి ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో గోల్డెన్ టెంపుల్ నిర్మాణంపై ఆశలు సన్నగిల్లాయి. దీంతో మంత్రి సవితతో కలసి ఇస్కాన్ ప్రతినిధులు మూడు నెలల క్రితం సీఎం చంద్రబాబును విజయవాడలో కలసి చర్చించారు. ఈ చర్చలో ప్రధాన సమస్యలు విన్న సీఎం ఆలయ నిర్మాణానికి తగిన సహకారం అందిస్తానని, పైప్‌లైన్, విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. ఈ క్రమంలోనే కొండ దిగువన అదనంగా 40 ఎకరాలను కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ చర్చలు జరిగి అప్పటికి మూడు నెలలు కావస్తున్నా... నేటికీ ఎలాంటి పురోగతి లేకుండా పోయింది.

4.88 హెక్టార్ల స్థలం కేటాయింపు..



గత ప్రభుత్వ హయాంలో కొండపైకి నిర్మించిన తారు రోడ్డు

గోల్డెన్ టెంపుల్ నిర్మాణానికి అప్పటి టీడీపీ ప్రభుత్వం 4.88 హెక్టార్ల స్థలం కేటాయించింది. ఈ క్రమంలో పురావస్తు, అటవీశాఖలను సమన్వయం చేసుకుని 4.88 హెక్టార్ల స్థలం కేటాయించారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర పురావస్తు, అటవీశాఖ అధికారులు పలు మార్లు సర్వే జరిపి వివాదం లేకుండా స్థలాన్ని కేటాయించారు. ఆ తర్వాత సాంకేతిక కారణాలతో పనులు ముందుకు సాగలేదు. ఆ తర్వాత రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత బేస్ క్యాంప్ కోసం కొండ దిగువన మరో 19.75 ఎకరాలను అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కేటాయించారు. కొండపై వాహనాల రాకపోకలకు అనుకూలం చేస్తూ అప్పటి మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ చొరవ తీసుకుని రూ.14 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత వారాంతపు సెలవుల్లో కొండపై పర్యాటకుల సందడి నెలకొంది.



రాయల కాలంలో నిర్మించిన కొలను, మంటపాలు

చెత్త తొలగించాకే పనులు

పట్టణ సమీపంలోని వీరణ్ణ కొండ వద్ద దారిలో గార్బేజ్ డంప్ ఉంది. దీనిని తొలగించడానికి కార్యాచరణ సిద్ధం చేసాం. మరో ప్రాంతానికి చెత్త తరలించిన తర్వాత పైప్ లైన్, విద్యుదీకరణ పనులు ప్రారంభిస్తాం. ఇస్కాన్‌కు సంపూర్ణ సహకారం అందించి గోల్డెన్ టెంపుల్ నిర్మాణం పూర్తి చేస్తాం.

– సవిత, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి

పర్యాటక అభివృద్ధికి దోహదం

కొండపై లక్ష్మీనరసింహస్వామి గోల్డెన్ టెంపుల్ నిర్మాణం జరిగితే ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది. దీంతో స్థానికంగా వాణిజ్యం ఊపందుకుంటుంది. ఎంతో ఉపయుక్తమైన చరిత్రను భావితరాలకు అందించేందుకు ఇస్కాన్ సహకారం ఎంతో అవసరం.

– సూర్యనారాయణ, పెనుకొండ

చిత్రహింసలు భరించలేకనే హతమార్చింది

- భర్త హత్య కేసులో వీడిన మిస్టరీ



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రెడ్డప్ప

ధర్మవరం రూరల్: భర్త పెట్టే చిత్ర హింసలు భరించలేక రోకలి బండతో తలపై బాది హతమార్చినట్లు నిందితురాలు అంగీకరించింది. వివరాలను శనివారం ధర్మవరం రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులుతో కలసి ఇన్‌చార్జ్ సీఐ రెడ్డప్ప వెల్లడించారు. ధర్మవరం మండలం ధర్మపురి గ్రామానికి చెందిన దేవరకొండ గోవిందు, అంజినమ్మ దంపతులు. వీరికి ముగ్గురు సంతానం. వీరందరికీ పెళ్లిలు కావడంతో వేర్వేరు ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు.కొన్నేళ్లుగా మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న గోవిందు తరచూ భార్య అంజినమ్మతో గొడవ పడేవాడు. వివాహేతర సంబంధానికి అడ్డు చెబుతుండడంతో ఆమెను అవమానిస్తూ ఎవరితో ఒకరితో ఆమెకకు సంబంధాలు అంటగడుతూ కొట్టి హింసించేవాడు. ఈ నెల 10న గోవిందు ధర్మవరం వెళ్లి కూరగాయలు కొని తెచ్చి ఇంట్లో ఇచ్చాడు. ఈ క్రమంలో మరోసారి భార్యతో గొడవ పెట్టుకున్నాడు. మాటామాట పెరగడంతో ఆమె గొంతును గట్టిగా అదిమి పెట్టడంతో ఊపిరి ఆడక ఇబ్బంది పడుతూ పక్కనే ఉన్న రోకలి బండతో గోవిందు తలపై బాదింది. గోవిందు మృతి చెందడంతో భయపడిన అంజినమ్మ అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు... శనివారం ఉదయం 8 గంటల సమయంలో రావులచెరువు క్రాస్ వద్ద ఉన్న అంజినమ్మను గుర్తించి అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన రోకలి బండను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

పండుగ పూట రెచ్చిపోయిన చైన్‌స్నాచర్లు

అనంతపురం: పండుగ పూట నగరంలో చైన్‌స్నాచర్లు రెచ్చిపోయారు. స్థానిక కోవూరు నగర్ 5వ క్రాస్‌లో ఆదివారం ఉదయం దుండగులు ఓ మహిళ మెడలో చైన్ దొంగిలించుకెళ్లారు. గతంలో ఇన్‌చార్జ్ డీఈఓగా పని చేసిన రంగస్వామి భార్య లక్ష్మీదేవి ఉదయం వాకింగ్‌కి వెళ్లి వస్తుండగా వెనుక వైపు నుంచి బైక్‌లో వచ్చిన ఇద్దరు దుండగులు 2.5 తులాల బంగారుచైను లాక్కెళ్లిపోయారు. నలుపు రంగు దుస్తులు ధరించి, ఇద్దరూ హెల్మెట్ పెట్టుకుని ఘటనకు పాల్పడ్డారు. ఈ విషయం సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. దీనిపై నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. చైన్ సుమారు రూ. 2 లక్షల విలువ చేస్తుందని పేర్కొన్నారు.

- అలాగే, శనివారం అనంతపురం సాయి నగర్ 4వ క్రాస్‌లో కనకదుర్గమ్మ గుడి వద్ద ముగ్గులు వేస్తున్న ఓ మహిళ మెడలో దుండగులు చైన్ లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. చైన్ తెగకపోవడంతో రోడ్డుపై పడి మహిళకు గాయాలు అయ్యాయి. చుట్టుపక్కల వారు కేకలు వేయడంతో దుండగులు అక్కడి నుంచి బైక్‌పై పరారయ్యారు. దీంతో పాటు పక్కవీధిలో మరో మహిళ మెడలో చైన్ లాగడానికి ప్రయత్నించి విఫలయ్యారు. చైన్ స్నాచర్ల ఆగడాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తండ్రిని హత్య చేసిన తనయుడు



హతుడు ఆవుల రవీంద్రారెడ్డి

అనంతపురం: మద్యం మత్తులో కుటుంబసభ్యులను వేధించడమే కాక... కుమార్తె పెళ్లి సంబంధాలనూ చెడగొడుతున్న తండ్రిని కుమారుడు హతమార్చాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని జనశక్తి నగర్‌లో నివాసముంటున్న ఆవుల రవీంద్రారెడ్డి (54) పేకాట, మద్యానికి బానిసై జులాయిగా మారాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఇంటికి చేరుకుని భార్యాపిల్లలను వేధించేవాడు. కుటుంబసభ్యులు ఎంత వారించినా ఆయనలో మార్పు రాలేదు. పైగా తన జల్సాలకు డబ్బు ఇవ్వలేదన్న అక్కసుతో కుమార్తెకు కుదిరిన పెళ్లి సంబంధాలను సైతం చెడగొడుతూ వచ్చేవాడు. శనివారం సాయంత్రం రవీంద్రారెడ్డి మద్యం మత్తులో ఇంటికి చేరుకుని భార్య శ్రీదేవితో గొడవపడ్డాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న కుమారుడు వేణుగోపాల కృష్ణారెడ్డి అడ్డుకోబోవడంతో ఘర్షణను మరింత పెద్దది చేశాడు. ఆ సమయంలో క్షణికావేశానికి లోనైన కుమారుడు రోకలితో తండ్రి తలపై దాడి చేయడంతో బలమైన గాయమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే కుటుంబసభ్యులు రవీంద్రారెడ్డిని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. హతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు నాల్గో పట్టణ సీఐ సాయినాథ్ వెల్లడించారు.

రిజర్వాయర్‌లో పడి ఒకరి మృతి

- మరొకరి గల్లంతు



మృతుడు అనిసుల్లాఖాన్ (ఫైల్)

పెనుకొండ రూరల్: ప్రమాదవశాత్తు గొల్లపల్లి రిజర్వాయర్‌లో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురంలోని నింకంపల్లికి చెందిన అనిసుల్లాఖాన్ (42) తన బంధువులతో కలసి ఆదివారం గొల్లపల్లి రిజర్వాయర్ సందర్శనకు వచ్చాడు. గట్టుపై నుంచి రిజర్వాయర్‌ను పరిశీలిస్తూ ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోయాడు. అప్రమత్తమైన బంధువులు వెంటనే రిజర్వాయర్‌లో అనిసుల్లా ఖాన్‌ను వెలికి తీసే లోపు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో హుటాహుటిన పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కియా ఎస్‌ఐ రాజేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థి గల్లంతు



రిజర్వాయర్‌లో గాలిస్తున్న దృశ్యం

గొల్లపల్లి రిజర్వాయర్ సందర్శనకు వచ్చిన ఓ విద్యార్థి గల్లంతయ్యాడు. కియా ఎస్‌ఐ రాజేష్ తెలిపిన మేరకు.. పెనుకొండ మండలం అమ్మవారిపల్లికి చెందిన చంద్రశేఖరరెడ్డి(19) అనంతపురంలోని ఎస్‌బీఎస్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవుల నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం తన స్నేహితులతో కలసి గొల్లపల్లి రిజర్వాయర్ సందర్శనకు వచ్చాడు. అనంతరం ఈత కొట్టేందుకు సిద్ధమై నీటిలో దిగిన చంద్రశేఖరరెడ్డి... ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహ వేగానికి రిజర్వాయర్‌లోకి కొట్టుకెళ్లాడు. తోటి మిత్రులు, స్థానికులు గాలింపు చేపట్టినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రమైనా ఆచూకీ లభ్యం కాలేదు.

కనుల పండువగా త్రిశక్తి అమ్మాజీ జాతర



ప్రత్యేక అలంకరణలో త్రిశక్తి అమ్మాజీ దేవతలు



ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు

రొళ్ల: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన జీరిగేపల్లి త్రిశక్తి అమ్మాజీ జాతర ఆదివారం కనుల పండువగా సాగింది. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏటా అమ్మవారి జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఒక్క రోజు జరిగే ఈ ఉత్సవానికి ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలివచ్చారు. వేకువ జామున అభిషేకం, కుంకుమార్చన, తదితర పూజలు చేశారు. అనంతరం త్రిశక్తి దేవతలుగా విరజిల్లుతున్న మారక్క, గ్యారక్క, ముదుపక్క దేవత మూర్తుల మూలవిరాట్‌లను వెండి, బంగారు ఆభరణాలతో పాటు భక్తులు కానుక రూపంలో తీసుకువచ్చిన పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాన్ని పూలతో అలంకరించి మేళతాళాలతో పాలబావి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి గంగాజలంతో శుభ్రపరిచారు. అనంతరం ఊయ్యాల స్తంభం వద్దకు చేర్చి పట్టం కూర్చొబెట్టారు. అక్కడి నుంచి ఊరేగింపుగా మేళతాళాలతో నృత్యం చేస్తూ ఉత్సవ విగ్రహాన్ని ఆలయం సమీపంలోని పట్టంపైకి చేర్చారు. ఉత్సవ విగ్రహాన్ని తీసుకెళ్లే దారిలో మహిళలు చన్నీటి స్నానం ఆచరించి తడి దుస్తులతో స్వామి వారి కాలి స్పర్శ కోసం బోర్ల పడుకుని మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించారు. భక్తులకు దాతల సహకారంతో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక

అనంతపురం: రాష్ట్ర స్థాయి అండర్ 13 విభాగం చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ ముగిసింది. ఓపెన్ విభాగంలో సామ్యూల్ స్టీఫెన్ నోబుల్ ప్రథమ స్థానాన్ని దక్కించుకోగా, ద్వితీయ స్థానంలో జొన్నల గడ్డల నితీష్ చౌదరి, బాలికల్లో ప్రథమ స్థానాన్ని వై.లాలిత్య, ద్వితీయ స్థానాన్ని త్రిపద దక్కించుకున్నారు. వీరు నవంబర్ 1, 3 తేదీల్లో తాడేపల్లి గూడెంలో జరిగే ఏపీ అండర్–13 ఓపెన్, బాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో అనంతపురం జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు ఇంటర్నేషనల్ అర్బిటర్ ఎ.ఉదయ్‌కుమార్ నాయుడు తెలిపారు.



చెస్‌లో ప్రతిభ చాటిన క్రీడాకారులు

చికిత్సకు డబ్బు లేక వివాహిత ఆత్మహత్య

సోమందేపల్లి: వైద్య చికిత్సకు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... సోమందేపల్లికి చెందిన చాకలి రమాదేవి (46), శ్రీనివాసులు దంపతులు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రమాదేవికి కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో దాచుకున్న డబ్బు మొత్తం ఖర్చై పోయింది. ప్రస్తుతం చికిత్సకు చేతిలో చిల్లిగవ్వ లేక ఇబ్బంది పడుతున్న విషయం గమనించిన రమాదేవి జీవితంపై విరక్తితో ఆదివారం పందిపర్తి రైల్వే గేట్ వద్దకు చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై హిందూపురం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కుంటలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

హిందూపురం అర్బన్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని సూరప్పకుంటలో ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి (50) మృతదేహం బయటపడింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీయించి జిల్లా స్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడికి సంబంధించి వివరాలు ఏవీ లభ్యం కాలేదు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ధర్మవరం జర్నలిస్ట్ కాలనీలో చోరీ



బాధితురాలితో వివరాలు ఆరా తీస్తున్న పోలీసులు

ధర్మవరం అర్బన్: స్థానిక జర్నలిస్ట్ కాలనీలో శనివారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... జర్నలిస్ట్ కాలనీలో నివాసముంటున్న సచివాలయ మహిళా పోలీసు లావణ్య, చంద్రశేఖర్ దంపతులు దసరా సెలవుల నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం అనంతపురానికి వెళ్లారు. ఈ క్రమంలో తాళం వేసిన ఇంటిని గమనించి దుండగులు శనివారం అర్ధరాత్రి తర్వాత తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. రెండు బీరువాలను ధ్వంసం చేసి అందులోని ఎనిమిదిన్నర తులాల బంగారు నగలు, రూ.84వేలు నగదు, పట్టుచీరలు అపహరించారు. ఆదివారం రాత్రి ఇంటికి చేరుకున్న లావణ్య దంపతులు... తలుపులు బద్దలుగొట్టిన విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో రెండో పట్టణ సీఐ రెడ్డప్ప, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జనావాసాల్లోకి పునుగు పిల్లి



పునుగు పిల్లి

రాయదుర్గంటౌన్: అరుదైన వన్యప్రాణి జాతికి చెందిన పునుగు పిల్లి జనావాసాల మధ్య కనిపించింది. పట్టణంలోని 18వ వార్డు తేరుబజారు వెనుక గల మేదర కాలనీలోని పాల నాయక్ అనే వ్యక్తి ఇంట్లోకి శనివారం పునుగుపిల్లి వచ్చింది. ఆయన దాన్ని చిన్న బోనులో ఉంచారు. ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించగా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ దామోదర్‌రెడ్డి, బీట్ ఆఫీసర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో పునుగుపిల్లిని పైతోట సమీపంలో అటవీ ప్రాంతంలో వదిలేశారు.

రైతులూ జాగ్రత్త

అనంతపురం అగ్రికల్చర్: అల్పపీడన ప్రభావంతో రాగల నాలుగు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్న నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశముండటంతో పంట తొలగింపు వాయిదా వేసుకోవాలని సూచించారు. తొలగించిన పంటలను టార్పాలిన్లతో కప్పి ఉంచాలన్నారు. ఉద్యానపంటల రైతులు కూడా పంట రక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులు గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

రెండుకు చేరిన ప్రమాద మృతుల సంఖ్య

రాప్తాడు: నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి... పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఈ నెల 10న రాప్తాడు పోలీస్ స్టేషన్ వెనుక 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదం తెలిసిందే. కారు ఢీకొన్న ఘటనలో అదే రోజు తలారి పోతులయ్య దుర్మరణం పాలయ్యాడు. తీవ్రంగా గాయపడిన అయ్యవారిపల్లికి చెందిన చెందిన జోగి లక్ష్మీనారాయణ (40)ను తొలుత అనంతపురంలోని సర్వజనాస్పత్రికి, ఆ తర్వాత ఓ ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున 5 గంటలకు ఆయన మృతి చెందాడు. కాగా, లక్ష్మీనారాయణ పాలచెర్ల గ్రామానికి చెందిన లక్ష్మిని వివాహం చేసుకుని పాలచెర్లలోనే ఉంటూ సెంట్రింగ్ పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై సీఐ టీవీ శ్రీహర్ష దర్యాప్తు చేపట్టారు.